

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.4,800

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	17
తిరుపతి	37	17
తిరుమల	29	14
గూడూరు	34	19
నగరి	35	18



ముందుచూపుతో తప్పిన ప్రాణనష్టం

ఫాక్స్‌లింక్ కర్మాగారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కార్మికులు 750మంది సురక్షితంగా బయటపడడం అధికారుల ముందుచూపు చర్యల ఫలితమేనని యాజమాన్యం తెలియజేస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

ప్రకటనల జారీకి అనుమతి తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు, వారి తరఫు వ్యక్తులు ఎలక్ట్రానిక్, ఇతర ప్రసార సాధనల్లో ప్రకటనల జారీచేసే ముందు అనుమతి తీసుకోవాలని ఏఆర్‌వో, డీఆర్‌వో రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల మేరకు కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ)ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీకి ఆర్‌వో, కలెక్టర్ హరి నారాయణన్ చైర్మన్‌గా, ఏఆర్‌వోగా డీఆర్‌వో, ఇతర సభ్యులు ఉంటారని తెలిపారు. ఏర్పాటైన కమిటీ ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలను నిరంతరం పర్యవేక్షిస్తుంటుందని పేర్కొన్నారు. ఏవైన ప్రకటనలు, చెల్లింపు వార్తలను గుర్తించి సంబంధిత అభ్యర్థుల ఎన్నికల ఖర్చులలో చూపుతారని తెలిపారు.

20 లోపు లైఫ్ సర్టిఫికెట్‌లు ఇవ్వాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు నిర్ణీత ఫారం పూర్తి చేసి ఈనెల 20వ తేదీ లోపు సంబంధిత సబ్‌ట్రెజరీల్లో లైఫ్ సర్టిఫికెట్‌ను అందజేయవచ్చని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్లులైఫ్ సర్టిఫికెట్‌ను జీవన్ ప్రమాన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే గడువు ఫిబ్రవరి 28తో ముగిసిందన్నారు. వివిధ కారణాలతో లైఫ్ సర్టిఫికెట్‌లు అందజేయని వారికి మరో అవకాశం కల్పించారన్నారు. నిర్ణీత ఫారంలో ఫొటోలు అతికించి ఈనెల 20వ తేదీ లోపు ఇవ్వొచ్చని ఆయన వివరించారు.

కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు



జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జేసీ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ నుంచి డీఆర్‌ఓ ఎస్.రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డితో కలిసి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 16న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం ప్రారంభంవుతుందన్నారు. పట్టభద్రులకు సంబంధించి ఆర్‌వీఎస్ కళాశాలలో, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు ఆర్‌వీఎస్ లా కాలేజ్ ఉంటుందన్నారు. పట్టభద్రుల ఓట్లు లెక్కింపునకు 20 టేబుళ్లను, ఉపాధ్యాయుల ఓట్లు లెక్కింపునకు 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలి పారు. ఓటర్లకు బీఎల్‌ఓల ద్వారానే స్లిప్పులు అందజేసి, ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు రేణుక, సృజన, శివయ్య వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

అమ్మో..భౌభౌ

- ఇటీవల చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లి ప్రాంతంలో తల్లిదండ్రులతో పాటు వెళ్తున్న ఓ చిన్నారిని కుక్క దాడిచేసి గాయపరిచింది. వెంటనే ఆ బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.
- చిత్తూరు భరత్ నగర్ నుంచి బండపల్లి వరకు కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రి పూట ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకుల వెంట పడుతుంటాయి. ఈ మధ్యకాలంలో ఓ వ్యక్తి కుక్కల వెంట బడడంతో పడిలేచి ఆస్పత్రి పాలయ్యాడు. ఈ మార్గంలో కుక్కలు గాయపరిచిన ఘటనలు అనేకం.
- చింతలగుంట పరిధిలో పనిచేసే ఓ పంచాయతీ కార్యదర్శి గ్రామ సందర్శన కోసం వెళ్లింది. ఆ సమయంలో ఓ వీధి కుక్క ఆమెపై దాడి చేసింది. దీంతో గ్రామస్తులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి తగిన వైద్యం అందించారు.
- ఎస్సార్‌పురం మండలం శివకుమార్ (16) స్థానికంగానే ఉండే ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఈనెల 18వ తేదీ బడి నుంచి ఇంటికి వెళ్తుండగా కుక్క ఆ బాలుడిపై దాడి చేసి గాయపరిచింది.
- మూడు రోజుల కిందట వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె పంచాయతీ నడిపిరెడ్డిపల్లిలో వీధి కుక్కలు 11 గొర్రెలపై దాడి చేశాయి. గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి.



మున్సిపాలిటీల్లోనే కాకుండా పల్లెల్లో కూడా వీధి కుక్కల బెడద ఎక్కువైంది. పాత, కొత్త అనే తేడా లేకుండా అందరిపై దాడి చేస్తున్నాయి. రోజూ కనీసం ఇద్దరు ముగ్గురు వీటి బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. వీధివీధినా పదుల సంఖ్యలో సంచరిస్తున్నాయి. పశువులు, వాహనాల్లో వెళ్లే వారిని వెంటపడి భయపెట్టడంతో పాటు కాటు వేస్తున్నాయి. కుక్కల వృద్ధి నియంత్రణ చర్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల హైదరాబాదులో ఓ చిన్నారి శునకాల గుంపు దాడిలో మృతి చెందిన విషయం విదితమే. ఈఘటనతో కుక్కల బెడదపై జనం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పెరిగిన వీధి కుక్కల బెడద
- వీధుల్లో హడలెత్తిస్తున్న వైనం
- ప్రజలను, పశువుల వెంట పడి దాడి
- జిల్లాలో 50 వేలకు పైగా వీధి కుక్కలు
- ఆస్పత్రుల్లో పెరుగుతున్న కుక్కకాటు కేసులు
- కట్టడికి చర్యలు చేపట్టిన అధికారులు



వెదురుకుప్పంలో కుక్కల దాడిలో గాయపడ్డ గొర్రెలు(ఫైల్)

చిత్తూరు రూరల్/శ్రీరంగరాజపురం: జిల్లాలో కుక్క కాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో సుమారు 30 వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయి. పెంపుడు కుక్కలు 20 వేలు ఉంటాయని అధికారుల అంచనా. కొందరు ఇంటికి కాపలాగా వీధికుక్కలనూ పెంచుకుంటున్నారు. మిగిలిన కుక్కలు వివిధ ప్రాంతాల్లో పడేసిన పదార్థాలను తింటూ బతుకుతున్నాయి. ఇవన్నీ గుంపుగుంపులుగా జనాన్ని దడ పుట్టిస్తున్నాయి. జనంపై దాడి చేయడమే కాకుండా పాడి ఆవులు, గొర్రెలు, మేకలపై పగపట్టి ఆస్పత్రి పాలు చేస్తున్నాయి. వాహనాల్లో వెళ్లే వారిని వెంట పడి భయపెట్టడంతో పాటు కాటు వేస్తున్నాయి. ఇలాంటి కేసులు జిల్లాలో అమాంతంగా పెరిగాయి. చిత్తూరు నగరం, మండలం, ఎస్సార్‌పురం, పూతలపట్టు, బంగారుపాళ్యం, వి.కోట, రామకుప్పం, పలమనేరు, జీడీనెల్లూరు, కుప్పం, శాంతిపురం, తవణంపల్లి, ఐరాల తదితర మండలాల పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉందని అధికారులు గుర్తించారు. ఆరు నెలల కాలంలో కుక్క కాటు కేసులు 6,184గా నమోదయ్యాయి. ఇందులో రేబిస్ కేసులు లేవని అధికారులు చెబుతున్నారు. అన్ని ప్రభుత్వ ఆస్ప త్రుల్లో కుక్క కాటుకు మందులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 48 వేల డోసుల టీకాలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

కట్టడికి చర్యలు...

ఒకే ఈతలో శునకాలు ఐదు పిల్లల వరకు జన్మనిస్తాయి. దీంతో ఏడాదికేడాది వాటి సంఖ్య పెరుగుతోంది. జంతు సంరక్షణ చట్టం ప్రకారం వీధి కుక్కలను చంపడం నేరం. వాటి సంతతిని అరికట్టేందుకు ఏబీసీ(అనిమల్ బర్త్ కంట్రోల్), జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిబంధనలు విధించారు. నిబంధనల ప్రకారం సంతానోత్పత్తి కలగకుండా చికిత్స చేస్తారు. ఆడ కుక్కలకు ఓ విధంగా, మగ శునకాలకు వేరే పద్ధతిలో ఈ చికిత్స చేస్తుంటారు. ఇవి పట్టణాల పరిధిలోనే చేస్తుండగా, దీని ఖర్చు మున్సిపాలిటీలే భరిస్తాయి. పిచ్చికుక్కలను చంపేందుకు జంతు సంరక్షణ కమిటీ తప్పనిసరిగా నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి శునకాల సంఖ్యను తగ్గించేందుకు అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.

కుక్కకాటు నమోదు కేసులు

సెప్టెంబర్–2022	1057
అక్టోబర్	1018
నవంబర్	1063
డిసెంబర్	1120
జనవరి–2023	1036
ఫిబ్రవరి 25 వరకు	890



నిర్లక్ష్యం వద్దు



కుక్క కరిస్తే వెంటనే ఆభాగాన్ని సబ్బుతో 10 నుంచి 15 నిమిషాల గొరువెచ్చని నోటితో శుభ్రం చేయాలి. గాయంపై కట్టు కట్టకూడదు. మట్టి, పసుపు, ఆకుపసరు వంటివి రాయకూడదు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కరిచిన తర్వాత మొదటి రోజుతో పాటు 3,7,14,28 రోజుల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఈవిషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికి ప్రమాదం ఉంది.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

వివిధ శాఖల సమన్వయంతో ..



మున్సిపాలిటీల్లో కుక్కల కట్టడికి తరచూ డ్రైవ్ జరుగుతోంది. గ్రామాల్లో కార్యదర్శులు, సర్పంచులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. వారి సహకారంతో నివారణకు చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్, పశుసంవర్ధకశాఖ డీడీ

ఇకపై రెండు మండలాలుగా చిత్తూరు

- అర్బన్, రూరల్ మండలాలుగా గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
- గతంలో హామీ నెరవేర్చలేకపోయిన టీడీపీ
- చిత్తూరు వాసుల హర్షం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు వాసుల చిరకాల కోరికను ప్రభుత్వం నెరవేర్చింది. పరిధిలో ఎక్కువగా ఉన్న చిత్తూరును అర్బన్, రూరల్‌గా విభజిస్తూ బుధవారం గెజిట్ నెంబర్ 256ను జారీచేసింది. అభ్యంతరాలు, సలహాలను తెలియజేసేందుకు 30 రోజుల పాటు అవకాశం కల్పించింది. పరిధిలో ఎక్కువగా ఉన్న చిత్తూరు మండలాన్ని రెండుగా చేయాలన్నది స్థానికుల సంవత్సరాల కోరిక. గతంలో టీడీపీ ప్రభుత్వం హామీలు ఇవ్వడమే తప్ప నెరవేర్చిన దాఖలాలు లేవు. అలాగే చిత్తూరు మండల విభజన హామీని కూడా అప్పటి టీడీపీ పాలకులు అటకెక్కించారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ సర్కారు ప్రజల ఆకాంక్షలకు అమలుకు శ్రీకారం చుట్టింది.



ప్రస్తుతం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

భౌగోళికంగా చిత్తూరు 54,949 ఎకరాల్లో..

భౌగోళికంగా 54,949 ఎకరాల్లో 41 రెవెన్యూ గ్రామాలతో చిత్తూరు మండలం కొనసాగుతోంది. పలు గ్రామాలు దూరంగా ఉండడంతో ప్రభుత్వ సేవలు పొందేందుకు ఇబ్బంది కరంగా ఉంటోంది. అధికారులు పనిభారంతో సతమతమవుతున్నారు. ఇకపై ఆ సమస్యలు తొలగనున్నాయి. చిత్తూరు అర్బన్, రూరల్ మండలాలు ఏర్పాటు అవుతుండడంతో ప్రజలకు మరింతగా నాణ్యమైన సేవలను అందించేందుకు అవకాశం ఉంటుంది.

గెజిట్ ప్రకారం....

- చిత్తూరు అర్బన్ పరిధిలోకి 15 రెవెన్యూ గ్రామాలను తీసుకొచ్చారు. తిమ్మసముద్రం, కట్టమంచి, గాండ్లపల్లి, చిత్తూరు, గ్రీమ్స్‌పేట్, ఇరువారం, అనుపల్లి పార్ట్, అనుపల్లి, మాపాక్షి, మాపాక్షి పార్ట్, నరిగపల్లి, లక్ష్మాంబపురం, మురకంబట్టు, మంగసముద్రం, దొడ్డిపల్లి ఉంటాయి.
- చిత్తూరు రూరల్ మండల పరిధిలోకి 26 గ్రామాలను తీసుకొచ్చారు. తేనెబండ, దిగువ మాసాపల్లి, ముత్తుకూరు, ఆనగల్లు, పాలూరు, బీఎన్‌ఆర్‌పేట, అయనవేడు, అరతల, 194 బండపల్లి, గువ్వకల్లు, పెడ్డిశెట్టిపల్లి, తుమ్మింద, సిద్ధంపల్లి, గొల్లపల్లి, వరదరాజులపల్లి, పెరుమాళ్లకండ్రిగ, చింతలగుంట, తాళంబేడు, కృష్ణాపురం, అనంతాపురం, పచ్చనపల్లి, 5–వెంకటాపురం, కురిచివేడు, అలుకురుపల్లి, 33–వెంకటాపురం, శెట్టియప్పతంగాల్ గ్రామాలను కలిపారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హరినారాయణన్
- పోలింగ్ నిర్వహణపై పీఓలు, ఏపీఓలకు శిక్షణ
- పోలింగ్‌లో పొరపాట్లకు తావివ్వకూడదని ఆదేశం




సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి హరినారాయణన్, పక్కన జేసీ వెంకటేశ్వర్

సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకమని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదేశించారు. ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు బుధవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. తరగతులను జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి ఆయన పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ 13వ తేదీ ఉదయం. 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు జరుగుతుందన్నారు. శిక్షణలో పూర్తి అవగాహన పెంపొందించుకుని పకడ్బందీ పోలింగ్ నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు.

నిష్పక్షపాతంగా నిర్వహణ

నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఇచ్చిన హ్యాండ్ బుక్ లోని అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి హరి నారాయణన్ తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లు, పీఓ డైరీ, బ్యాలెట్ బాక్స్‌లను సీల్ వేసి తరలించడం తదితర అంశాలపై అవగాహన ముఖ్యమన్నారు. పీఓలు, ఏపీఓలుగా నియమితులైన వారందరూ కేటాయించిన రెవెన్యూ డివిజన్ అధికారికి ఈనెల 12న రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. సామగ్రిని అదే రోజున తీసుకుని కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు సాయంత్రం చేరుకోవ లసి ఉంటుందన్నారు. పోలింగ్ రోజున ఏజెంట్‌లకు పాసుల పంపిణీ చేసి, సీటింగ్ ఏర్పాట్లు ఉదయం 7 గంటలకు పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పోలింగ్ నిర్వహణ, హ్యాండ్‌బుక్‌లోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఏఆర్‌ఓ, డీఆర్‌ఓ ఎస్. రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

7లోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లాకు సంబంధించి ఈనెల 7వ తేదీ లోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేస్తామని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై బుధవారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వర్చువల్ విధానంలో సమీక్షించారు. ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు.ఆరు జిల్లాల అధికారులను సమన్వయం చేసుకుని కసరత్తు నిర్వహిస్తున్నామన్నారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి ఓటర్ స్లిప్పుల పంపిణీ జరుగుతున్నట్లు వివరించారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తామని చెప్పారు. 100 పోలింగ్ కేంద్రాల్లో (69 పట్టభద్రులు,31 ఉపాధ్యాయులు) వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు ఏజెన్సీని నియమించినట్లు తెలిపారు. 48 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో కౌంటింగ్ నిర్వహణకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని సిబ్బందిని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ జగదీష్, ఆర్‌డీఓలు రేణుకా, సృజన, శివయ్య, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఇక స్మార్ట్ పే

పన్నులు వందశాతం వసూలైతే గ్రామాల అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుంది. పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లకు ఆన్‌లైన్ సేవలను పంచాయతీరాజ్‌శాఖ అందుబాటులోకి తెస్తోంది. క్యూర్ కోడ్ స్కానింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పన్నుల చెల్లించే వెసులుబాటు కల్పించనుంది. ప్రయోగాత్మకంగా జిల్లాలోని బంగారుపాళ్యం పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. త్వరలో ఈ విధానం పనితీరును ఆధారంగా అన్ని పంచాయతీల్లో అమలు చేయనుంది.





- పీఓఎస్ మిషన్ల ద్వారా పన్నుల వసూలు
- ప్రయోగాత్మకంగా బంగారుపాళ్యంలో అమలు
- లావాదేవీలు పారదర్శకం

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పన్నులు వసూలు చేసేందుకు డిజిటలైజేషన్ విధానం అమలు కానుంది. పన్ను వసూళ్ల డిజిటలైజేషన్ ఇప్పటి వరకు నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అమలవుతోంది. ఈ క్రమంలో జిల్లాలోని బంగారుపాళ్యంలోని మేజర్ పంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఆస్తి పన్ను డిజిటలైజేషన్ ప్రక్రియకు ఎంపిక చేశారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ కార్యదర్శిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రత్యేకంగా అకౌంట్ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. బంగారుపాళ్యం పంచాయతీలో 1664 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వాటి నుంచి వార్షిక పన్నుల డిమాండ్ లక్ష్యం రూ.20.51 లక్షలు కాగా, ప్రస్తుతం రూ.14.65 లక్షలు మేర ఇప్పటి వరకు వసూలు అయింది. అంటే 71 శాతం వసూలు చేయగలిగారు. పంచాయతీరాజ్‌శాఖ నిర్ణయం మేరకు మార్చి లోపు 90 శాతం పైగా పన్నులు వసూలు చేయాల్సి ఉంది. పంచాయతీ పరిధిలో క్యూర్ కోడ్ స్కానింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పన్నుల చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. బంగారుపాళ్యం పంచాయతీ అధికారులకు పాయింట్ ఆఫ్ సేల్ డివైసెస్ (పీఓఎస్ మిషన్లు) త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

చెల్లింపులు ఇలా

గ్రామాల వారీగా ఇంటి యజమాని వివరాలు, ఇంటి విస్తీర్ణం, భవన నిర్మాణ తీరు ఆధారంగా నిర్ధారించిన పన్నుల వివరాలన్నీ పీఓఎస్ మిషన్లతో అనుసంధానించిన సాఫ్ట్‌వేర్‌లో ఆప్‌లోడ్ చేస్తారు. కోడ్ నంబరును పీఓఎస్ మిషన్‌లో ఎంటర్ చేయగానే చెల్లించాల్సిన పన్ను మొత్తం స్కీన్‌పై కనిపిస్తుంది. ఈ వివరాలను బట్టి ఇంటి యజమాని ఆన్‌లైన్‌లో పన్ను నగదు చెల్లించే మార్గాలను చూపిస్తుంది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర వాటిల్లో ఎంపిక చేసుకుని క్రెడిట్, డెబిట్ కార్డు లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు చెల్లిస్తే నేరుగా పంచాయతీ అకౌంట్‌కు జమ అవుతుంది.

ఆదేశాలు అందాయి



ఇంటి పన్ను వసూళ్లలో ప్రయోగాత్మకంగా డిజిటలైజేషన్‌ను అమలు చేయాలని ఆదేశాలు అందాయి. పీఓఎస్ మిషన్ త్వరలో జిల్లాకు రానుంది. తదనంతరం అందులో వివరాలను నమోదు చేసి వసూలు చేయనున్నాం. ఈమేరకు బ్యాంక్ అకౌంట్‌ను ప్రారంభించాం. వీటిపై ఈఓపీఆర్‌డీకు ఆదేశాలు ఇచ్చాం.

– లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

ప్రసన్న వెంకన్నకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను తీసుకు వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సోమల: మండలంలోని ఆవులపల్లెలో టీటీడీ అనుబంధ శ్రీశ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వామి పట్టు వస్త్రాలను సమర్పించి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డికి, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌కు అర్చకులు గోపీ స్వామి తీర్థ ప్రసాదాలు అందజేసి, సత్కరించారు. అనంతరం ఆవులపల్లె వద్ద సుమారు రూ.800 కోట్లతో నిర్మిస్తున్న సీతమ్మ చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను మంత్రి పెద్దిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించగా, సత్వరం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ కోదండరాజు తదితరులు పాల్గొన్నారు.

వేదనకు గురిచేసినందుకు ఫోరం అక్షింతలు

చిత్తూరు అర్బన్: అవసరాల కోసం అప్పుతీసుకుని, ఆపై దాన్ని తీర్చేసినా నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా మానసిక క్షోభకు గురిచేసిన ఫైనాన్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్ (ఫోరం) మొట్టికాయులు వేసింది. మదనపల్లెకు చెందిన బాధితుడికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని చిత్తూరులోని ఫోరం బుధవారం తీర్పునిచ్చింది. మదనపల్లెకు చెందిన గుస్సా వెంకటాచలపతి నాయుడు తన అవసరాల కోసం 2019లో స్థానికంగా ఉన్న ఫైవ్‌స్టార్ బిజినెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి రూ.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని 24 నెలల్లో ఈఎంఐ చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. 2021 నవంబర్ వరకు ప్రతి నెలా కంతు (ఈఎంఐ) చెల్లిస్తూ వచ్చిన వెంకటాచలపతి నాయుడు.. అదే నెల అడ్వాన్సు చెల్లింపులను సైతం ఒకేసారి కట్టేశాడు. దీని తరువాత సంస్థ నుంచి నో డ్యూ సర్టిఫికెట్ అడిగితే అదనంగా రూ.6 లక్షలు చెల్లించాలని నోటీసులు పంపారు. దీంతో బాధితుడు ఫోరంను ఆశ్రయించగా, వినియోగదారుడు పడ్డ మానసిక వేదనకు రూ.లక్ష పరిహారం, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు అదనంగా చెల్లించాలని ఫైనాన్స్ కంపెనీని ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు అనిత, సభ్యులు కోమల, సలీం తీర్పునిచ్చారు.

మట్టి టిప్పర్ల సీజ్

యాదమరి : మండల పరిధిలోని పెరుమాళ్లపల్లె వద్ద ఆరులేన్ల రహదారిలో మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను మైన్స్ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం రాత్రి మట్టి, రాళ్లను తరలిస్తున్న మూడు టిప్పర్లును మైన్స్ అధికారులు ఆపారు. వీటికి సంబంధించి ఎలాంటి అనుమతులు, రికార్డులు లేక పోవడంతో సీజ్ చేశారు. అనంతరం వాహనాలను స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.



రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే
కఠిన చర్యలు

- సాంకేతిక పరిజ్ఞానంతో త్వరితగతిన కేసుల విచారణ
- జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి


సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్పీ రిశాంత్ రెడ్డి

కుప్పం: రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం కుప్పం అర్బన్, రూరల్ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులు స్థితిగతులను సమీక్షించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేసుల్లో వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని త్వరితగతన విచారణ పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత కాల వ్యవధిలో కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. స్కూల్స్, హోటల్స్, లాడ్జి వంటి ప్రదేశాల్లో నిఘా పెంచాలన్నారు. నిఘా పెంచి నేరాలు తగ్గే విధంగా యంత్రాగం పనిచేయాలన్నారు. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తే చట్టరీత్య చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐలు శ్రీధర్, రియాజ్ అమ్మద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


గాంధీనగర్ వద్ద వెనుక వైపు నుంచి లారీని ఢీకొన్న టెంపో

పలమనేరు: పట్టణ సమీపంలో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నాగమంగళం వద్ద వేకువజామున రోడ్డు దాటుతున్న వెస్ట్ బెంగాల్ వాసి దిల్‌బచ్చర్‌టరన్(40)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కలకత్తా నుంచి కేరళకు ప్రవేటు బస్సులో వస్తున్నాడు. నాగమంగళం వద్ద బస్సు ఆపగా కాలకృత్యాల కోసం ఆవ్యక్తి రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మరోవైపు పట్టణ సమీపంలోని గాంధీనగర్ వద్ద మరమ్మతులకు గురైన లారీని వెనుక వైపు నుంచి మరో టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ పుంగనూరుకు చెందిన జబ్రుల్లాఖాన్(43) తీవ్రంగా గాయపడ్డాడు. ఇతని కుడిచేయి తెగి కిందపడింది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగని గజరాజుల విధ్వంసకాండ


ఏనుగులు ధ్వంసం చేసిన కర్బూజ పంటను అధికారులకు చూపుతున్న రైతులు

పెద్దపంజాణి: మండలంలోని పెద్ద కాప్పల్లి, కోగిలేరు పంచాయతీ పంటలపై గజరాజుల విధ్వంసం కొనసా గుతూనే ఉంది. మంగళవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన నాలుగు ఏనుగులు పాట్టగానిపల్లెకు చెందిన నాగేశ్వరరావు, శంకరప్ప తదితరులకు చెందిన కర్బూజ పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. అంతర పంటగా సాగుచేసిన అరటి పంటను పూర్తిగా తినేశాయి. దాదాపు రూ. లక్షకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు బుధవారం వాపోయారు. విషయం తెలుసుకున్న రాయలపేట, చారాల బీట్ ఆఫీసర్లు రవికుమార్, దొరస్వామి ఏనుగులు నష్ట పరిచిన పొలాలను బుధవారం పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపించి నష్టపరిహారం మంజూరుకు చర్యలు చేపడతామని తెలిపారు.

గడ్డూరు గుడి స్థలం వద్ద ఉద్రిక్తత

పలమనేరు: మున్సిపల్ పరిధిలోని గడ్డూరు గ్రామం వద్ద గుడి స్థలంలో ప్రహరీగోడ నిర్మాణ విషయమై బుధవారం ఉద్రిక్తత నెలకొంది. ఆస్థలం ఆలయానికి సంబంధించిదంటూ గ్రామస్థులు, కాదు తనకు దివ్యాంగుల కోటా లో పట్టా ఇచ్చారంటూ పకీరుపల్లికి చెందిన వెంకట్రమణ వర్గీయులు వాగ్వాదాలకు దిగారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదులందాయి. భూవివాదంపై రెవెన్యూ అధికారుల సూచనల మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలి

చిత్తూరు రూరల్: కుష్టు వ్యాధి నివారణకు వైద్యం బృందం సమిష్టిగా కృషి చేయాలని డీపీఎంఓలు రవికుమార్, గుణశేఖర్, రాముడు అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ఆశవర్కర్లు, అర్బన్ హెల్త్ డాక్టర్లు, ఏఎన్‌ఎంలకు అర్బన్ ప్రాంతాల్లో కుష్టు వ్యాధి సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మార్చి ప్రారంభం నుంచి 21వ తేదివరకు కుష్టువ్యాధిపై అర్బన్ ప్రాంతాల్లో మాత్రమే సర్వే చేయాల్సి ఉందన్నారు. ఈ సర్వేలో వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. విధిగా ప్రతి ఇంటికి వెళ్లి సర్వేను పక్కాగా నమోదు చేయాలన్నారు.

సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలు

సూళ్లూరుపేట రూరల్ : పట్టణంలోని మహాదేవయ్య నగర్‌లో బుధవారం షేక్ బాషిద్ అనే వ్యక్తి ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఐదుగు రు గాయపడ్డారు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాహిద్ కొంత కాలంగా పట్టణంలో పానీపూరీ అమ్ముకుంటూ జీనవం సాగిస్తున్నా డు. ఈ క్రమంలో ఇంటి వద్ద పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌కు గ్యాస్ నింపుతుండగా ప్రమాదం సంభవించింది. దీంతో బాహిద్‌తో పాటు అతడి భార్య రూబీ, పిల్లలు నౌషద్, నగ్మా, ఆస్మా తీవ్రంగా గాయపడ్డారు. రూబీ, నగ్మా పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్సలందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ : నలుగురికి గాయాలు

తడ: మండలంలోని కాదలూరు కూడలి వద్ద జాతీయ రహదారిపై బుధవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. వివరాలు.. సూళ్లూరుపేట మండలం జంగాలగుంటకు చెందిన తిన్నలూరి శేఖర్ కాదలూరుకు వెళ్లాడు. మరో వ్యక్తితో కలిసి బైక్ రోడ్డు దాటుతుండగా, ఎదురుగా మరో ద్విచక్రవాహనంపై వస్తున్న మణిరెడ్డి, లక్ష్మి దంపతులు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి.

అంతా క్షేమంగా ఉండాలని ప్రార్థించా

- కాణిపాకం వినాయకుడిని, తిరుమ లేశుని దర్శించుకున్న స్పీకర్ తమ్మినేని



కాణిపాకం ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, తిరుమల ఆలయం వెలుపల అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి

తిరుమల / కాణిపాకం(యాదమరి): అందరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించానని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. స్పీకర్ తమ్మినేని బుధవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని, కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం కాణిపాకంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజలందరూ, వారితో పాటు తాను క్షేమంగా, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించానని తెలిపారు.

సీఎంకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరా : డిప్యూటీ స్పీకర్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నడిపేందుకు అవసరం అయ్యే శక్తి ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ నెలలో జరుగబోయే బడ్జెట్ శాసనసభ సమావేశాలు సాఫీగా సాగాలని, ఈ సమావేశాలకు ఎటువంటి అవరోధం కలిగించకుండా ప్రతిపక్షానికి మంచి జ్ఞానం కలిగించాలని వేడుకున్నానని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉండాలి


యాదమరి ఉన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

యాదమరి: ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలని అధికారులను జిల్లా కలెక్టర్ హరినారాయణ సూచించారు. బుధవారం మధ్యాహ్నం యాదమరి ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అవసరమైన విద్యుత్, తాగునీరు, అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ర్యాంపు ఏర్పాటు, వెబ్ కాస్టింగ్ నిమిత్తం అవసరమైన ఇంటర్ నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో 'డైట్' ప్రతిభ


అధ్యాపకురాలు వరలక్ష్మి, ఛాత్రోపాధ్యాయులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పురుషోత్తం

కార్వేటినగరం: మధ్యప్రదేశ్‌లోని భోపాల్ రవీంద్ర నాథ్ ఠాగూర్ యూనివర్సిటీ షోద్ శిఖర్ పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ రీసెర్చ్ ప్రాజెక్టులో జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) అధ్యాపకులు వరలక్ష్మి ప్రతిభ చాటారు. బుధవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ప్రిన్సిపల్ శ్రీరాం పురుషోత్తం మాట్లాడుతూ వరలక్ష్మితో పాటు ఛాత్రోపాధ్యాయులు ఎస్.సుస్మిత, జనని, ఎన్.హేమ కలసి కళాధారిత విద్యా విధానంపై పరిశోధన ప్రాజెక్టును ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో ప్లాటినం కేటగిరి కింద ప్రశంసా పత్రంతో పాటు రూ.15 వేల నగదు బహుమతిని అందుకుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి 60 ప్రాజెక్టులను ప్రదర్శించగా, ప్రథమ స్థానంలో నిలిచి డైట్ పేరు ప్రఖ్యాతలను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన అధ్యాపకురాలు,ఛాత్రోపాధ్యాయులను అభినందించారు.

వందేళ్ల వెంకటమ్మ

- ఫిబ్రవరి 26న నూరవ ఏటలోకి..
- ఇప్పటికీ నడుస్తూ.. పనులు చేస్తున్న వైనం
- కుటుంబ సంతతి 36 మంది


వందేళ్ల జన్మదిన వేడుకల్లో వెంకటమ్మ కుటుంబసభ్యులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకలవారిపల్లెకు చెందిన దివంగత పోకల సిద్ధయ్య భార్య పోకల వెంకటమ్మ(100) ఏళ్లు పూర్తి చేసుకుంది. 2023 ఫిబ్రవరి 26న వందేళ్లు నిండడంతో కుటుంబసభ్యులు ఆమెకు కనకాభిషేకం జరిపించారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. భర్త మరో ఇద్దరు చనిపోవడంతో ప్రస్తుతం ఆమె సంతతికి చెందిన వారు 33 మంది ఉన్నారు. వీరందరి సమక్షంలో తన నూరవ ఏట జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఏ ఆధారం లేకుండా నడుస్తా..



వంద సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ ఏ ఆధారంలేకుండా నడవగలుగుతున్నా. ఇతరుల సాయం లేకుండా నా పనులు నేనే చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఇప్పటికైతే ఏ జబ్బులు లేవని, ఏ జబ్బు ఇబ్బంది పెట్టలేదు. ప్రశాంతంగా నా కుమారుల దగ్గర ఉంటున్నాను. చిన్నప్పటి నుంచి పొలం పనులకు వెళ్లి సద్ది, సంగటి తినడం వల్ల ఆరోగ్యంగా ఇప్పటికీ ఉండగలుగుతున్నాను. **వెంకటమ్మ**

వలంటీర్‌కు లైన్‌మన్ వేధింపులు

- దిశలో జీరో ఎఫ్ఐఆర్

చిత్తూరు అర్బన్: వలంటీర్‌గా పనిచేస్తున్న ఓ వివాహితను విద్యుత్‌శాఖలో లైన్‌మెన్ వేధించసాగాడు. రాత్రి 10 గంటల సమయంలో బాధితురాలు కాణిపాకం నుంచి చిత్తూరులోని దిశ స్టేషన్‌కు వస్తే.. జరిగిన ఘటన తమ పరిధిలోకి రాకున్నా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి చిత్తూరు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ బాబుప్రసాద్ కథనం మేరకు.. ఐరాల మండలంలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఓ మహిళను కాణిపాకం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న లైన్‌మెన్ శ్రీనివాసులు ఫోన్‌లో పలుమార్లు వేధించాడు. గత నెల 5వ తేదీన వలంటీర్ తన భర్తతో కలిసి అగరంపల్లె పెట్రోలు బంకు వద్ద లైన్‌మెన్‌ను నిలదీస్తే దాడికి ప్రయత్నించాడు. దీంతో ఈనెల 20వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో వలంటీర్ చిత్తూరు నగరంలోని దిశ పోలీస్ స్టేషన్ పోలీసులను ఆశ్రయించారు. గొడవ జరిగిన ఘటన తమ పరిధిలోకి రాకున్నా.. వెంటనే స్పందించిన పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేసి కాణిపాకం పోలీస్ స్టేషన్‌కు కేసు బదిలీ చేశారు. చిత్తూరు నగరంలోని సంతపేటలో కాపురముంటున్న లైన్‌మెన్ శ్రీనివాసులుపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాణిపాకం పోలీసులు కేసును దర్యాప్తు చేస్తుండగా.. తాజాగా ఈ వివరాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

ముందుచూపుతో తప్పిన ప్రాణనష్టం


అగ్నిప్రమాద సమయంలో అత్యవసర ద్వారాలు, మెట్ల నుంచి బయటకు వచ్చిన కార్మికులు


ప్రమాద సమయంలో పై అంతస్తు నుంచి కార్మికులు బయటకు వచ్చిన మెట్లు

రేణిగుంట: తిరుపతి విమానాయశ్రయానికి సమీపంలోని ఫాక్స్‌లింక్ కర్మాగారంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కర్మాగారం పూర్తిగా కాలి బుగ్గి అయినా.. అప్పటివరకు పనిచేస్తున్న కార్మికులు 750మంది సురక్షితంగా బయటపడడం ప్రభుత్వ అధికారుల ముందుచూపు చర్యల ఫలితమేనని కర్మాగారం యాజమాన్యం తెలియజేస్తోంది. నిర్మాణ సమయంలో పైఅంతస్తులో 250 మంది కార్మికులు విధులు నిర్వహించేందుకు వీలుగా గదులు ఏర్పాటుచేశారు. పై అంతస్తులో ఏవైనా ప్రమాదాలు జరిగితే కార్మికులు కిందకు త్వరగా దిగేందుకు ఎమర్జెన్సీ మెట్లు, తలుపులు అమర్చలేదు. అప్పటి కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌రెడ్డి ఎమర్జెన్సీ ద్వారాలు, ఇనుప మెట్లు ఏర్పాటుచేయాలని లేకుంటే అనుమతి ఇవ్వనని కర్మాగారం యాజమాన్యాన్ని ఆదేశించారు. అంతటితో ఆగకుండా ఆయనే చొరవ తీసుకుని దగ్గరుండి గోడ పగులగొట్టి ఎమర్జెన్సీ ద్వారం, తలుపులు ఏర్పాటు చేయించారు. సోమవారం కర్మాగారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పై అంతస్తులోని 250 మంది కార్మికులు ఎమర్జెన్సీ ద్వారం నుంచి కొద్ది నిమిషాల వ్యవధిలో మూడు వైపుల నుంచి కిందకు దిగి ప్రమాదం నుంచి సురక్షితంగా తప్పించుకోగలిగారు. ఈ ప్రమాదం జరిగాక, కంపెనీ ప్రతినిధులు తనతో మాట్లాడి అప్పట్లో పటిష్ట చర్యలు తీసుకోకుంటే పెను విపత్తు సంభవించేదని స్పష్టం చేయడం తనకు ఎంతో సంతృప్తిని మిగిల్చిందని శివకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనతోపాటు సురక్షిత చర్యలు గురించి ప్రత్యేక శ్రద్ధ వహించి అనుమతులను ఇస్తోందని ఆయన స్పష్టంచేశారు.